క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్లు విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీలు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం, పద్మావతి యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అన్న అంశంపై ఏప్రిల్ 21 నుంచి మూడు రోజులు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఎస్వీయూ వీసీ ఛాంబర్‌లో శుక్రవారం సదస్సు బ్రోచర్లను పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్లు రజిని, భూపతినాయుడు, డాక్టర్ ఎంఎల్‌పీరెడ్డి, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : బ్యాంకుల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని తిరుపతి ఉద్యోగ సంఘం నేతలు విజయభాస్కర్, ధన్వంతకుమార్ డిమాండ్ చేశారు. వారు శుక్రవారం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు తిరుపతిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సఘం సభ్యులు జనార్ధన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలత, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, విఘ్నేష్ బాబు, నందకుమార్, పవన్, శంకర్ రావు, లక్ష్మీపతి, నటరాజ్, శివ శంకర్ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

తిరుపతి గాంధీ రోడ్డు : పుల్వామా దాడిలో అసువులు బాసిన 40 మంది అమర జవానులకు శుక్రవారం బీజేపీ నాయకులు స్థానిక కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ పుల్వామా దాడిలో అసువులు బాసిన ప్రతి సైనికుడినీ దేశం గుర్తించుకుంటుందన్నారు. నేడు మనం దేశంలో ప్రశాంతంగా ఉన్నామంటే అందుకు దేశ సరిహద్దుల్లోని సైనికులే కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నార్త్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, సీనియర్ నాయకులు చంద్రబాబు యాదవ్, తూర్పు మండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మల్లారపు రవి ప్రసాద్, మైనార్టీ మోర్చా జిల్లా నాయకులు మస్తాన్, నార్త్ మండల ప్రధాన కార్యదర్శి సత్యకుమార్, యువమోర్చా నాయకులు బాలాజీ, చంగల్ రాయులు, లక్ష్మయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

చంద్రగిరి: పనపాకం సమీపంలో శుక్రవారం వ్యాపారుల మధ్య జరిగిన గొడవలో వృద్ధుడిపై మరో వర్గం వారు దాడి చేశారు. పాకాల మండలం తాటిమాకులపల్లికి చెందిన మునస్వామి, జయంతి వృద్ధ దంపతులు కొంత కాలంగా పనపాకం జాతీయ రహదారి పక్కన వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వారిని అధికారులు అక్కడి నుంచి తొలగించారు. ఇటీవల తిరిగి వ్యాపారాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో వారి మధ్య శుక్రవారం ఆధిపత్య పోరు చోటు చేసుకుంది. మునస్వామి, జయంతి దంపతులు ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. రెండేళ్ల నుంచి ఇక్కడే ఉన్నామని, ఇక్కడి నుంచి వెళ్లిపోమంటే ఎలా అని వారు ప్రశ్నించారు. దీంతో తోటి వ్యాపారులు సుబ్రమణ్యం, లక్ష్మీ, మంజుల, నాగభూషణమ్మ, నాగమ్మ వారిపై దాడి చేశారు. మునస్వామి రాళ్లపై పడడంతో నడుముకు తీవ్ర గాయమైంది. వెంటనే 108లో తిరుపతి రుయాకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

తిరుపతి సిటీ : ఆప్కాస్‌ను రద్దు చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. వారు శుక్రవారం కార్మికులు, ఆప్కాస్ ఉద్యోగులతో కలిసి అగ్రికల్చర్ కళాశాల మెయిన్ గేటు వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులను వేధించడమే పనిగా పెట్టుకుందన్నారు. జీవో నంబర్ 2ను సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల వల్ల మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ జోక్యం పెరుగుతుందని వివరించారు. ప్రభాకర్ రెడ్డి, శంకరయ్య, ముని, రాజా, వాణిశ్రీ, రమేష్, రవి, మోహన్, గురవయ్య, పరంధామయ్య, సుబ్రహ్మణ్యం, యుగంధర్, భార్గవ్, బాబు, నందు పాల్గొన్నారు.

ప్రజల జీవన యానంలో రోడ్లు ముఖ్య భూమికను పోషిస్తాయి. రోడ్లు బాగుంటే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అందుకే ప్రభుత్వాలు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ ఉంటాయి. నేటి పాలకుల అసమర్థత కారణంగా తిరుచానూరు పంచాయతీలోని సుమారు 600 మందికి ప్రజలు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 200 మీటర్లు నడిస్తే గమ్యస్థానానికి చేరుకునే వారమని, ఇప్పుడు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.



స్వర్ణముఖిలో వరద ప్రవాహానికి కుప్పకూలిన తాత్కాలిక వంతెన

దారి లేక.. వంతెనపై వెళ్లలేక..!

- 200 మీటర్ల నడకకు ఒకటిన్నర కిలోమీటరు నడవాలి
- బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు
- అంచనాలు సిద్ధం చేసినా అనుమతులు ఇవ్వలేదు
- పంచాయతీ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పంచాయతీ నుంచి ముండ్లపూడికి రాకపోకలు సాగించేందుకు స్వర్ణముఖి నదిపై బండిబాట ఉంది. దీని ద్వారా నందనవనం, బృందావన కాలనీ, వర్షావిశ్వనాథ నగర్ కాలనీలకు చెందిన సుమారు 600 మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. తిరుచానూరు నుంచి ఈ మార్గంలో 200 మీటర్లు నడిస్తే గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. గత ఏడాది నవంబరులో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలు పాడిపేట రోడ్డులో ఒకటిన్నర కిలోమీటరు వెళ్లి తిరిగి ముండ్లపూడి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారని, రైతులు సైతం ఇబ్బంది పడుతున్నారు. స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా ఈ దారి కోతకు గురవుతూనే ఉంది. దీంతో ఆ మార్గం గుండా నడిచేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. నదిపై వంతెన నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. ఈ క్రమంలో నదిపై వంతెన నిర్మాణానికి రూ.20 లక్షల మేర ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. అంత డబ్బు దానికి మంజూరు చేయడానికి ఆ పంచాయతీ అధికారికి మనసు రాకపోవడంతో కాగితాలకే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నదిపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



తిరుచానూరు నుంచి ముండ్లపూడి వైపు వెళ్లే రోడ్డులో బారికేడ్లు పెట్టిన అధికారులు

తిరుచ్చిపై సిరుల తల్లి చిద్విలాసం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేష పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీకృష్ణ మండపంలోకి వేంచేపు చేశారు. కనుల పండువగా కల్యాణం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.



తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతీ అమ్మవారు

మేధోశక్తి మెరుగుకు మెడిటేషన్ అవసరం

తిరుపతి సిటీ : యోగా, మెడిటేషన్ చేయడం ద్వారా విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవచ్చని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. టీటీడీ అధికారులు ఆదేశాల మేరకు మహర్షి వేదిక్ వర్సిటీ టీమ్ శుక్రవారం ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జానకి, వరలక్ష్మి, చంద్రయ్య పాల్గొన్నారు.

గ్రామీణ పర్యాటకం అభివృద్ధి చెందాలి

తిరుపతి సిటీ : గ్రామీణ పర్యాటక రంగం అభివృద్ధి చెందితేనే గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఉన్నత విద్యా మండలి మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగం, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా శుక్రవారం గ్రామీణ పర్యాటకం, సుస్థిర గ్రామీణ జీవనోపాధి అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ పర్యాటకం అభివృద్ధి, సుస్థిరత సాంస్కృతిక పర్యాటకం, స్థానిక వనరులు, వినియోగం తదితర అంశాలపై విశ్లేషించారు. ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, అధ్యాపకులు, విద్యార్థులు గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ బి.సురేష్, పాండిచ్చేరి వర్సిటీ ప్రొఫెసర్ వై.వెంకటరావు, హెడ్ డాక్టర్ నీరజ, డాక్టర్ పి.మాధవి పాల్గొన్నారు.



జాతీయ సదస్సుకు హాజరైన అతిథులు

ఈసీసీఈపై శిక్షణ తరగతులు

చంద్రగిరి : స్థానిక బాలుర పాఠశాలలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఎంఈవో లలితకుమారి, సీడీపీవో ప్రదీప మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు పంపిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా అందిస్తే పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆదర్శ, నవచేత పథకాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, అనితావాణి, టాటా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ వినీత్ పాల్గొన్నారు.

పశువైద్యశాలలో స్తంభించిన ఓపీ, ఓటీలు



తాతయ్య గుంట పశువైద్యశాల వద్ద నిరసన తెలుపుతున్న వెటర్నరీ జూడాలు



వెటర్నరీ వర్సిటీ పశువైద్యశాల ఎదుట 12వరోజు నిరసన తెలుపుతున్న జూడాలు

– 12వ రోజుకు చేరిన వెటర్నరీ జూడాల సమ్మె

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాల సమ్మె తారాస్థాయికి చేరింది. గౌరవ వేతనాన్ని పెంచాలంటూ జూడాలు చేపట్టిన నిరవధిక నిరసన శుక్రవారం 12వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా వారు వర్సిటీలోని పశువైద్యశాలలో ఓపీలు, ఓటీలను స్తంభింపజేశారు. దీంతో రైతులు, పెట్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నగరంలో తాతయ్య గుంట వద్దగల పశువైద్యశాలలో సైతం ఓపీలను నిలిపేశారు. పశువైద్యశాల ఎదుట పెద్ద ఎత్తున బైటాయించారు. వారు మాట్లాడుతూ 12 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీ విద్యార్థులకు రూ.25 వేలు, పీజీ విద్యార్థులకు రూ.50 వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.75 వేలు గౌరవ వేతనం ఇచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు.

ముగ్గురికి జైలు, జరిమానా

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రెండు రోజులు చొప్పున జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు చేసి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న సత్యసాయి జిల్లా, ధర్మవరం పట్టణానికి చెందిన కె బయన్న, తిరుపతి, చెర్లోపల్లి, రిక్షా కాలనీకి చెందిన బి.నంద గోపాల్, తిరుమల, బాలాజీనగర్‌కు చెందిన కే శ్రీకుమార్‌పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 పది వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే నగరంలో రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న కేసుల్లో 49 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుశీలాదేవి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పరిశీలించారు. చెత్త సేకరణ, ఎరువుల తయారీలో అనుసరిస్తున్న పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ రమణ, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎల్పీవో సురేష్‌నాయుడు, ఎంపీడీవో రామచంద్ర వున్నారు.

వికసిత్ భారత్‌పై జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇండియా యాజ్ ఎన్ ఎమర్జింగ్ గ్లోబల్ పవర్– ది జర్నీ టువార్డ్స్ వికసిత్ భారత్ అట్ 2047 అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. వర్సిటీ అధికారులు, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేయాలన్నారు.

వెంకటసుబ్బమ్మకు నివాళి

తిరుపతి మంగళం : తిరుపతి కొర్లగుంటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మహేష్ తల్లి వెంకటసుబ్బమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కొర్లగుంటకు చేరుకుని వెంకటసుబ్బమ్మ బౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

నాయకులకు పరామర్శ

తిరుపతి మంగళం : తిరుపతి 33వ డివిజన్ అశోక్‌నగర్‌లోని పార్టీ నాయకుడు లక్ష్మీ వెంకటేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శుక్రవారం అతని నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న అశోక్‌నగర్‌లోని నాయకురాలు పద్మజ తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు. నాయకులు మద్దాలి శేఖర్‌రాయల్, రమణారెడ్డి, వెంకటేష్‌యాదవ్, విజయలక్ష్మి, రాధ, అనిత, చెంగల్రాజు, పద్మనాభరెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.





లక్ష్మీ వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న అభినయ్‌రెడ్డి, పద్మజ తల్లితో మాట్లాడుతున్న అభినయ్‌రెడ్డి

వైదిక ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మహామహోపాధ్యాయ ఈట భద్రేష్ దాస్ స్వామీజి

తిరుపతి సిటీ : వేద ప్రచారం, వైదిక ధర్మ పరిరక్షణకు వేదిక్ వర్సిటీ విద్యార్థులు కృషి చేయాలని ఢిల్లీ అక్షర ధామ్ నారాయణ సంస్థాన్‌కు చెందిన మహామహోపాధ్యాయ ఈట భద్రేష్ దాస్ స్వామీజి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం వేదిక్ వర్సిటీలో పలు విభాగాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులు చేసిన చతుర్వేద మంత్రపఠనం శ్రవణానందంగా ఉందని కొనియాడారు. వేద పఠనం చేస్తున్న విద్యార్థులు సమాజసేవకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. వేద సంకల్ప విద్యను పాటించి వేద సంరక్షణకు కృషిచేయాలన్నారు. అనంతరం వర్సిటీలోని భూమిని సందర్శించి అక్కడ మట్టిని స్వీకరించి తిలక ధారణ గావించారు. ఈ కార్యక్రమంలో వీసీ రాణి సదాశివమూర్తి, డీన్ గోళి సుబ్రహ్మణ్య శర్మ, అధ్యాపకులు తారక రామశర్మ, రాజేష్, పవన్, ఉమేష్, బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: ఏపీ షెడ్యూల్‌కులాల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్, డైరీలను శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డీవీఎంసీలో ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం నుంచి ఒకరిని సభ్యునిగా నియమించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం డీఆర్వో, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, స్విమ్స్ డైరెక్టర్, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎంను కలిసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చెంగల్రాయులు, ప్రధాన కార్యదర్శి భూపాల్, కోశాధికారి ధనుంజయులు, గోవింద్, మురళీ, గంగాధరం, మైఖేల్, ఏకాంబరం, రామకృష్ణ, మోహన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరింపజేస్తున్న షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ నేతలు

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

తిరుపతి రూరల్ : తిరుచానూరు శిల్పారామంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేత కార్మికులకు చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్, కల్చరల్ సొసైటీ చైర్మన్ మంజులరెడ్డి, శిల్పారామం ఏవో ఖాదర్ వలి తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

షికారీలను వాగ్రివేల్ కమ్యూనిటీగా గుర్తించాలి



ఐక్యత చాటుతున్న మహాసంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : దేశవ్యాప్తంగా వున్న షికారీలను వాగ్రివేల్ కమ్యూనిటీగా గుర్తించాలని అఖిల భారతీయ ఆదిమ మహాసంఘం జాతీయ అధ్యక్షుడు రూప్ సింగ్‌బాయ్ బార్బీడియా, జాతీయ మహిళా అధ్యక్షురాలు కుముదా సుశీలప్ప డిమాండ్ చేశారు. గిరిజన్ భవన్‌లో శుక్రవారం అఖిల భారతీయ ఆదిమ మహాసంఘం జాతీయ సమ్మేళనం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నున్న షికారీలను హేళన చేసేలా వివిధ పేర్లతో పిలుస్తున్నారని, అవమానంగా ఉందన్నారు. షికారులను వాగ్రివేల్ కమ్యూనిటీగా గుర్తించి ప్రభుత్వ ఫలాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇప్పడైనా తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ నుంచి శుక్రవారం రాత్రి మహా కుంభమేళాకు మరో బస్సు సర్వీస్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే తిరుపతి నుంచి రెండు సర్వీసులు పంపించారు. తాజాగా మరో బస్సు సర్వీస్‌ను డీపీటీవో నరసింహులు, డీసీటీఎం విశ్వనాథం, డీఎం బాలాజీ జెండా ఊపి పంపించారు.

జ్ఞానాన్ని పెంచే గ్రంథాలపై దృష్టి పెట్టాలి

తిరుపతి సిటీ : జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాల రచనలపై రచయితలు దృష్టి సారించాలని యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అర్చనా ఠాకూర్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత వర్సిటీ, జాతీయ సంస్కృత వర్సిటీ సంయుక్తంగా చేపట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై భారతీయ భాషల పుస్తక రచయితల సదస్సు శుక్రవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు, గ్రంథాలు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, డాక్టర్ సూర్యప్రసాద్, ప్రొఫెసర్ కె.గిరిధరరావు, డీన్ దక్షణమూర్తి శర్మ, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 50మంది రచయితలు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు

మా పాలకవర్గం రద్దుకు కుట్ర

- టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్ : ప్రజలతో ఎన్నికై తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకు(టౌన్ బ్యాంకు) అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న తమ పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు కూటమి నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2022లో తమ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గత పాలకవర్గంలో నిలిచిపోయిన రూ.47 కోట్ల మొండి బకాయిల్లో రూ.30 కోట్లు వసూలు చేశామని గుర్తు చేశారు. టీటీడీ నుంచి రూ.10 కోట్లను డిపాజిట్ చేయించినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షతో టీటీడీ చేసిన డిపాజిట్లను వెనక్కు తీసుకునేలా చేశారని విమర్శించారు. తమ పాలకవర్గంలో రెండు పోస్టులను మాత్రమే భర్తీ చేశామని, 27 మందిని నియమించినట్టు తమపై ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. 2007–10 మధ్య అప్పటి పాలకవర్గం ఇచ్చిన లోన్లను తమకు ఆపాదించి ఆర్‌సీఎస్ కమిషన్ ఆదేశాలతో 51 విచారణ కమిటీ వేయించి పాలకవర్గాన్ని రద్దు చేయించేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. విచారణకు 90 రోజులు గడువు ఉన్నా 45 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. బీసీ యాదవ కులానికి చెందిన బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ చాంబర్ వద్ద మందు బాటిళ్లు పెట్టి దుమారం లేపారని, అతనికి చాంబర్‌కు తాళాలు వేయించి బీసీలను అవమానించారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి

రాజకీయ కుట్రలు

జనసేన నేతలు రాజకీయ కుట్రలు చేస్తూ బీసీల అణచివేతకు పాల్పడుతున్నారని టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ విమర్శించారు. టౌన్ బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేని ఎమెల్యే కుమారుడు ఆరణి మదన్ అరాచకాలు సృష్టిస్తున్నాడని దుయ్యబట్టారు. ఒక బీసీ వైస్ చైర్మన్‌గా ఉండడాన్ని సహించలేని కూటమి నేతలు బ్యాంకు ఉద్యోగులతో కుమ్మక్కై రాత్రి వేళ తన చాంబర్‌లో మద్యం బాటిల్ పెట్టించారని ఆరోపించారు. తమ రాజకీయ పబ్బం కోసం బీసీలు, యాదవులను టార్గెట్ చేసి వారిపై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. జనసేన నేతల అరాచకాలను చూస్తూ ఊరుకోమని, ప్రశ్నిస్తునే ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, ఖాశీంబాష, జ్యోతి ప్రకాష్, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్ర, వెంకటేష్, గీతా యాదవ్, పెరుగుబాబు యాదవ్, ప్రకాష్, చింతా రమేస్, సురేష్ యాదవ్, కోటి, బాలాజి, సునీల్ యాదవ్ పాల్గొన్నారు.